క్లుప్తంగా

మహిళా బిల్లులో ఓబీసీ వాటా ప్రకటించాలి

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీల వాటా శాతం ఎంతో స్పష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన 33శాతం మహిళ బిల్లులో జనాభాలో అత్యధికంగా ఉన్న ఓబీసీ మహిళలకు ఎంత రిజర్వేషన్ కల్పిస్తారో చెప్పకపోవడం బాధాకరమని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఓబీసీ మహిళల వాటా శాతం ఎంతో ప్రకటించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 12న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఒకరోజు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పరేపల్లి మహేష్, తురక శ్రీనివాస్, తురక రమేష్, కొల్లూరి హనుమంతురావు, ద్వారక శ్రీను పాల్గొన్నారు.

టీఎంబీ ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



కొరిటెపాడు(గుంటూరు): ప్రముఖ ప్రైవేటు బ్యాంక్ అయిన తమిళనాడ్ మార్కంటైల్ బ్యాంక్(టీఎంబీ) లిమిటెడ్ 102 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా కాన్ఫిడెన్స్ డెంటల్ హాస్పిటల్ సహకారంతో పట్నంబజారులోని బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 150 మంది దంత పరీక్షలు చేయించుకున్నారు. బ్యాంక్ రీజినల్ మేనేజర్ రాజప్పన్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమాన్ని మేనేజర్ దినకర్ జేబకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు. డాక్టర్ పి.వి.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

గుంటూరు మెడికల్: జీజీహెచ్ సీటీవీఎస్ వైద్యులు సకాలంలో స్పందించి అరుదైన శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలతో పాటు మోచేతిని తెగిపోకుండా కాపాడారు. శుక్రవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శస్త్రచికిత్స చేసిన వైద్యుల్ని అభినందించారు. గుంటూరు రూరల్ మండలం గోరంట్లకు చెందిన 56 ఏళ్ల దొప్పలపూడి జోజప్ప ప్లంబర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 6న పని చేస్తున్న సమయంలో రంపం మిషన్ అదుపు తప్పి ఎడమ చెయ్యి మోచేతికి తీవ్ర గాయమైంది. రక్తనాళం తెగిపోవడంతో తీవ్ర రక్తస్రావమై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు వెంటనే అతడ్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు వెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. కుడి కాలులోని రక్తనాళాన్ని తీసి ఎడమ చేతిలో తెగిన రక్తనాళం వద్ద అతికించి, స్రావాన్ని అరికట్టారు. ఆపరేషన్ ప్రక్రియలో సీటీవీఎస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మొగావత్ మోతీలాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ యోగి సుందరరావు, డాక్టర్ కుప్పుస్వామి, జనరల్ సర్జరీ పీజీ డాక్టర్ సల్మా, ఎనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు. ఆపరేషన్ విజయవంతం అవడంతో శుక్రవారం జోజప్పను డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇలాంటి ఆపరేషన్ చేయాలంటే రూ. 3 లక్షలు ఖర్చు అవుతుందని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశామని ఆయన చెప్పారు.

శ్రీ పూజిత స్కూల్లో ముందస్తు దీపావళి సంబరాలు



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని శ్రీ పూజిత స్కూల్లో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు నరకాసురుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. పాఠశాల ప్రాంగణంలో చిన్నారులతో ఉపాధ్యాయులు బాణసంచా కాల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ నరకాసురుడనే రాక్షసుడ్ని సంహరించిన మరుసటి రోజే, అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. మన సంస్కృతికి ప్రతిబింబాలైన పండుగలు, వేడుకల్ని పాఠశాలలో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు చక్కని అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అలరించిన గణిత అవధానం



నెహ్రూనగర్: నెహ్రూనగర్ 7వ లైనులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూలులో శుక్రవారం గణిత అవధానాన్ని నిర్వహించారు. టీచర్లు, విద్యార్థులు అడిగిన స్క్వేర్ రూట్, క్యూబ్ రూటును సెకండ్లలో అవలీలగా 8వ తరగతి విద్యార్థి నాగుల సతీష్ తెలిపాడు. గణితంలో ప్రతిభ చూపిన సతీష్‌ను హైకోర్టు న్యాయవాది వి. నాంచారయ్య అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వృద్ధులు, చిన్నారుల ‘ఊపిరి’ తీస్తున్న న్యుమోనియా

ఊపిరితిత్తులకు సోకి, ప్రాణాలు తీసే వ్యాధుల్లో న్యుమోనియా ఒకటి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం అప్పుడే పుట్టిన పిల్లల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు వ్యాధితో చనిపోతున్నారు. ఏటా ఐదేళ్లలోపు పిల్లలు రెండు మిలియన్ల మంది దీని బారిన పడి చనిపోతున్నారు. నివారణకు టీకాను వినియోగించడం ద్వారా మరణాలు తగ్గించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడిస్తోంది. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2009 నుంచి ఏటా నవంబర్ 12న వరల్డ్ న్యుమోనియా డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- గుంటూరు మెడికల్

- వ్యాధి వస్తే ప్రాణానికే ప్రమాదం
- పిల్లలు, 65 ఏళ్లు దాటిన వారికీ ఎక్కువగా సోకే అవకాశం
- వ్యాధిపై అవగాహనతోనే అడ్డుకట్ట
- చలికాలంలో ఎక్కువగా కేసులు నమోదు
- రేపు వరల్డ్ న్యుమోనియా డే

న్యుమోనియా అన్ని వయస్సుల వారికి వస్తుంది. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన వారిలో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండటం వల్ల దీని బారిన పడుతున్నారు. దగ్గు, జలుబు, కళ్లె పడటం, పసుపు లేదా పచ్చగా ఉండటం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఆయాసం, అలసట, ఛాతిలో నొప్పి, ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉండటం, జ్వరం, చలి, వణుకు ఉండటం, తలనొప్పి, కండరాల నొప్పులు, చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం లేదా తక్కువగా కొట్టుకోవడం, వికారం, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు వ్యాధి సోకిన వారిలో ఉంటాయి. పిల్లల్లో సోకితే శ్వాస తీసుకునే సమయంలో డొక్కలు ఎగురవేయడం, ఎక్కువ సార్లు వేగంగా శ్వాస తీసుకోవడం, అధిక జ్వరం, దగ్గు, జలుబు, ఎక్కువగా ఉండటం, పిల్లలు పాలు తాగలేకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. చలి కాలంలో న్యూమోనియా కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఎక్కువ. ఆడవారితో పోల్చితే మగవారిలోనే బాధితులు ఎక్కువగా ఉంటున్నారు.



న్యుమోనియా డే పోస్టర్స్

కారణాలు

వ్యాధి ఉన్న వారు ముఖానికి కర్చీఫ్ పెట్టుకోకుండా దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపర్ల ద్వారా క్రిములు గాలిలో వ్యాపించి పక్కన ఉండే వారికి సోకుతుంది. వైరస్, బ్యాక్టీరియా ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. రోగనిరోధకశక్తి తక్కువ ఉన్న వారు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు, పొగ తాగే వారు, మద్యపానం చేసేవారు, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారిలో ఈ వ్యాధి సోకుతుంది.

నిర్ధారణ

ఛాతీ ఎక్సరే, సీటీ స్కాన్, రక్త, కళ్లె పరీక్ష, బ్రాంకోస్కోపీ, పల్స్ ఆక్సీమెట్రీ, ఫ్లూయిడ్ కల్చర్ పరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తారు.

వ్యాధి బాధితులు అధికమే...

గుంటూరు జిల్లాలో 150 మంది పిల్లల వైద్య నిపుణులు, 100 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ ఇద్దరు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో పిల్లల్లో 2022–23లో 465 మంది, 2023 డిసెంబర్ వరకు 341 మంది న్యుమోనియా బారిన పడ్డారు.

ఉచితంగా వ్యాక్సిన్



రాష్ట్ర ప్రభుత్వం న్యుమోనియా మరణాలు కట్టడి చేయడమే లక్ష్యంగా 2021 జులై నుంచి ఉచితంగా న్యుమోనియా కాంటిగేట్ వ్యాక్సిన్(పీసీవీ) చిన్నారులకు వేయిస్తోంది. వ్యాధి సోకకుండా బిడ్డ పుట్టిన 45 రోజులకు, మూడున్నర నెలకు, తొమ్మిదో నెలలో వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి నివారణలో ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 34,819 మంది చిన్నారులకు ఉచితంగా పీసీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేశాం. నవంబర్ 12 నుంచి 2024 ఫిబ్రవరి 28 వరకు అవగాహన సదస్సుల్ని జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌వో, గుంటూరు

పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ చేయించాలి



వ్యాధి రాకుండా ముందస్తుగా పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ చేయించాలి. నేడు పిల్లలకు, పెద్దవారికి వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఉచితంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలకు వేయిస్తోంది. విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వినియోగించకూడదు. పబ్లిక్ ప్రదేశాల్లోకి వెళ్లినప్పుడు ముఖానికి మాస్క్ అడ్డుపెట్టుకోవడం చాలా మంచిది.

– డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, సీనియర్ పిల్లల వైద్య నిపుణులు, గుంటూరు

జాగ్రత్తలు తీసుకోవాలి



న్యుమోనియా వ్యాధి బాధితులు త్వరగా కోలుకోవడానికి వైద్యులు రాసిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. ధూమపానం చేసేవారికి దూరంగా ఉండటంతోపాటుగా మద్యపానం, ధూమపానం చేయకూడదు. దగ్గినా, తుమ్మినా ముఖానికి కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి. తరచుగా చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. ఛాతీ సమస్యలను ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించాలి.

– డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు.

జగన్ ఎగైన్ స్టిక్కర్స్ ఆవిష్కరణ



జగన్ ఎగైన్ స్టిక్కర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమని ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. 2024 జగన్ ఎగైన్ స్టిక్కర్లను గాంధీ పార్కు వద్ద తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, రాష్ట్ర అధ్యాపక అధ్యక్షులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పి.ముత్యం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమాతో కలిసి అయోధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఇటు అభివృద్ధిలోనూ అటు సంక్షేమంలోనూ పరుగులు తీయిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూకే వింగ్ సభ్యులు మలిరెడ్డి కిషోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు పేరయ్య చౌదరి, షేక్ మీరావలి, నరసింహ చౌదరి, సాని కొమ్ము జ్యోతి, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



ఉపకార వేతనాలు అందజేస్తున్న విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్‌కావటి తదితరులు

పట్నంబజారు: దేశంలో ఎక్కడా లేని విధంగా ముస్లింల భద్రత, సంక్షేమం, ఉన్నతికి అనేక కార్యక్రమాల్ని అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనమండలి ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో శుక్రవారం ఆయన అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్, షాదీఖానా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ ముస్లింల జీవితాల్లో ప్రగతి పూలు పూయిస్తూ వారి ప్రయోజనాల్ని కాపాడటంలో సీఎం వై.ఎస్.జగన్ అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో యావత్తూ ముస్లిం సమాజం సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ ముస్లింల జీవితాల్లో విద్య ద్వారా వెలుగులు నింపుతున్న వైనం అత్యద్భుతమని కొనియాడారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ మైనారిటీల అభ్యున్నతికి సీఎం వైయస్ జగన్ కంకణబద్ధులై ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రోషన్, కార్పొరేటర్లు షేక్ రోషన్, మార్కెట్ బాబు, అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, బూసి రాజలత, ప్రభుత్వ ఖాజీ ఉస్మాన్, ముఫ్తీ బషీర్, మన్సూర్, హఫీజ్ ఇర్షాద్, ఇసాక్, షాదీఖానా కమిటీ ఫరియాజ్, షఫి, నజీర్, బాబు, గౌస్, నజీర్, అబ్బాస్, షౌకత్ అలీ, అబ్దుల్ రెహ్మాన్, నూనె ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ఎంతో గొప్పది

ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత



మాట్లాడుతున్న ఎస్పీ కె.జి.వి.సరిత

ఏఎన్‌యూ: భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కె.జి.వి.సరిత పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రొఫెషనల్ కళాశాలల విద్యార్థులకు ఇండక్షన్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని డైక్‌మన్ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఏపీ సీఐడీ విభాగం ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేటి రోజుల్లో విద్యార్థులు జల్సాలకు అలవాటు పడి జీవితాలను వెనక్కు నెట్టేసుకుంటున్నారన్నారు. ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగాన్ని కొనియాడుతున్నాయని చెప్పారు. ఆర్టికల్– 14, ఆర్టికల్– 21 వీటిలో ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఒకటి తనకు నచ్చినట్లు ఉండొచ్చని చెబుతూనే మరొకటి ఇతరుల స్వేచ్ఛకు భంగం కలుగకూడదని వివరించారు. యువత చెడు ఆలోచనలతో భారత రాజ్యాంగాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్ కోసం విమర్శిస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్‌కు తావు లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ పి. వరప్రసాద మూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది 15 వరకు నూతన కోర్సులను ప్రారంభించి విద్యా అవకాశాలను విస్తృతం చేస్తున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ మాట్లాడుతూ వర్సిటీలో ర్యాగింగ్ నిషేధించబడిందని, సీనియర్ విద్యార్థులు జూనియర్లపై ర్యాగింగ్ పరిధిలోకి వచ్చే అంశాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయం జీరో ర్యాగింగ్ క్యాంపస్‌గా రూపాంతరం చెందిందని తెలిపారు. ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్సన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రమీల రాణి, ఓఎస్డీ ప్రొఫెసర్ కే సునీత మాట్లాడారు.

ప్రధాన రోడ్ల మరమ్మతులు నెలాఖరులోగా పూర్తి చేయాలి

నెహ్రూనగర్: నగరంలోని ప్రధాన రోడ్లకు మరమ్మతులను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నెలాఖరు నాటికీ పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ శంకరరావు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి

నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాల ర్యాంప్‌లు రోడ్డు మీదకు రాకూడదని, సెట్ బ్యాక్‌లో నిర్మాణాలు చేయకూడదని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని తెలిపారు. నగరంలోని ఎస్వీఎన్ కాలనీ, నవభారత్ నగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని ఆమె పరిశీలించారు.

మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడమే ప్రధాని ఉద్దేశం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాల జేఏసీ నాయకులు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ చేయాలని మాదిగలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు దేశ ప్రధాని ముఖ్య అతిథిగా హాజర్వడం మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం ఆయన నేతృత్వంలో రాష్ట్రంలో ఉన్న అన్ని మాల సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాలు, ఆయా రాజకీయ పార్టీలలో ఉన్న మాల నాయకులతో ముఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు మతతత్వ పార్టీగా ముద్రపడిన బీజేపీ రేపటి మాదిగల సభతో కులతత్వ పార్టీగా కూడా మారిందని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేయనున్నామని తెలిపారు. జేఏసీ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి, నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మల్లెల వెంకట్రావ్, పంతగాని రమేష్, పాలేటి మహేష్, జి.చార్వాక, అన్నవరపు కిశోర్, నల్లపు నీలాంబరం, పొందుగల చైతన్య పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న నూరి ఫాతిమా

నెహ్రూనగర్: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తోందని, సామాజిక న్యాయంలో ఆయన దేశంలోనే ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గం 56వ డివిజన్ కార్పొరేటర్ అయిసెట్టి కనకదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం 'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమాన్ని 162వ సచివాలయం వద్ద నిర్వహించారు.

ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ గ్రామం నుంచి రాజధానుల వరకు నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సాధించిన విజయాల్ని ప్రజలకు వివరించడమే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. వ్యవసాయం, పరిశ్రమలు, తలసరి ఆదాయం, ఉద్యోగాల కల్పన, విద్య.. ఇలా ప్రతి రంగంలో జగన్ ప్రభుత్వం ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తపై ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్, శృంగారపు ఎరబ్రాబు, అగ్గిపెట్టి రాజు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. సంపత్‌నగర్‌కు చెందిన రాజనాల శ్రీనివాసరావు అనుమతులు లేకుండా బాణసంచా దుకాణం పెట్టి విక్రయిస్తున్నాడు. తనిఖీలు నిర్వహించిన లాలాపేట పోలీసులు టపాసుల్ని స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్ రామ్‌పూర్ గ్రామానికి చెందిన రమేష్ మాల్ (38) గుంటూరు జీజీహెచ్‌లో కాంక్రీట్ పనులు చేసేందుకు కూలీగా వచ్చాడు. ఈనెల 9న పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భావి వైద్యులు సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లాలి

భాష్యం రామకృష్ణ



మాట్లాడుతున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: భావి వైద్యులుగా ఎదిగే విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ సూచించారు. ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెడెక్స్, గోరంట్లలోని ధన్వంతరి, రామసేతు మెడీఎయిమ్స్, సుశ్రుత క్యాంపస్‌లలో వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ వైద్యులు తమ వద్దకు వచ్చే రోగుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. దీన్ని ప్రతి విద్యార్థి గుర్తెరిగి నడుచుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉత్తమ వైద్యులుగా రాణిస్తారని సూచించారు. ప్రస్తుతం సమాజంలో వైద్య వృత్తి అనగానే ధనార్జనే ప్రధాన ధ్యేయమనే అపోహ ఉందని, ఆ విధంగా కాకుండా రోగుల మనసెరిగి నడుచుకుంటూ వారిలో భరోసా నింపాలని చెప్పారు. ఈ విధంగా ఉత్తమ వైద్యులుగా సమాజంలో రాణిస్తారని విద్యార్థులకు ఉద్బోధించారు. భాష్యం మెడికల్ ఫౌండేషన్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ఉత్తమ వైద్య విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి, ఉత్తమ వైద్యులుగా స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, మెడిఎయిమ్స్ ప్రిన్సిపాల్స్ సుధ, చాంద్ బాషా, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినీ, టీవీ నటీనటులకు అవార్డుల ప్రదానం



నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య వేదికపై కళా విపంచి, కళ పత్రిక సంయుక్తంగా కళా విపంచి సినీ, టీవీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ సభ శుక్రవారం నిర్వహించాయి. రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాజంలో కళకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ఆయన చెప్పారు. అనంతరం సినీ, టీవీ నటీనటులు పద్మ జయంతి, గీతాసింగ్, డాక్టర్ సి.ఎస్.ప్రసాద్, కె.ఎస్.కుమార్, మేకా రామకృష్ణ, కల్యాణమాధవి, స్వప్నలను అవార్డులతో ఘనంగా సత్కరించారు. తెలుగు భాషా, తెలుగు జాతి సంపద అనే అంశంపై సయ్యద్ జానీ బాషా ఆధ్వర్యంలో సాహితీవేత్తలు కవితా పఠనం చేశారు. గీతాసింగ్ బృందం హాస్యవల్లరి, కల్యాణి మాధవి మిమిక్రీ ప్రేక్షకుల్ని అలరించాయి. కార్యక్రమంలో యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, నాట్యాచార్యులు పండిట్ అంజిబాబు, యువ కళావాహిని అధ్యక్షుడు డాక్టర్ లంకా లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు , కళా విపంచి సంపాదకులు డాక్టర్ మహమ్మద్ రఫీ, జి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు, కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, వ్యాపారవేత్త సంజయ్ పాల్గొన్నారు.

తెలుగు భాష, సాహిత్య ఉన్నతికి సి.పి. బ్రౌన్ కృషి



లక్ష్మీపురం: తెలుగు భాష, సాహిత్యాన్ని సి.పి. బ్రౌన్ ప్రజ్వలింప చేశారని ప్రముఖ నాటక రచయిత బి.వి రామ్‌కుమార్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సి.పి బ్రౌన్ 225వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ అవివాహితుడైన బ్రౌన్ రాత్రింబవళ్లు తెలుగు భాషా సాహిత్యాలే ఊపిరిగా జీవించారన్నారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవ ఎన్నటికీ మరవలేనిదన్నారు. ఆయన తయారు చేసిన నిఘంటువులు విశేష కీర్తి తెచ్చి పెట్టాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు బిళ్లా అశోక్, గాయకులు వై.కె.వి. మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఈఎల్‌సీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

నెహ్రూనగర్: మార్టిన్ లూథర్ జయంతిని పురస్కరించుకుని ఏఈఎల్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోడరేట్ బిషప్ పరదేశి బాబు మాట్లాడుతూ మార్టిన్ లూథర్ జయంతిని పాస్టర్స్ డేగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల మధ్య శాంతి, సమాధానం కోసం నగరంలో శాంతి ర్యాలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. 25 వసంతాల పాస్టర్స్ డేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బిషప్ బాబూరావు, దైవాశీర్వాదం, ప్రకాష్, దైవ సేవకులు పాల్గొన్నారు.